



వర్చువల్ విధానంలో పరిశ్రమల యాజమాన్యంతో మాట్లాడుతున్న చంద్రబాబు

# ఎర్రచందనం పరిరక్షణకు..
# 'కగార్' తరహా ఆపరేషన్



గోదాముల్లో ఎర్రచందనం క్వాలిటీ పరిశీలిస్తూ...

- స్మగ్లర్లకు పవన్‌కల్యాణ్ హెచ్చరిక
- నలుగురు కింగ్‌పిన్ స్మగ్లర్లు గుర్తింపు

**ప్రజాశక్తి-తిరుపతి(మంగళం)**

శేషాచలం అడవులలో మాత్రమే వద్ధి చెందే ఎర్రచందనం చెట్లను నరికి కోట్ల రూపాయలు వెనకేసుకుంటున్న కింగ్ పిన్ స్మగ్లర్లు, ఇకపై శేషాచలం అడవుల వైపు వస్తే భయం కలిగేలా ఆపరేషన్ కగార్ తరహాలో ఎర్రచందనం పరిరక్షణ కోసం ప్రత్యేక ఆపరేషన్ చేపట్టనున్నట్లు రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖ మంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ స్మగ్లర్లకు హెచ్చరికలు జారీ చేశారు. తిరుపతి పర్యటనలో భాగంగా శనివారం ఉదయం మామండూరు అటవీ ప్రాంతాన్ని జిల్లా అధికారులతో కలిసి ఆయన పరిశీలించారు. తిరుపతి రేణిగుంట విమానాశ్రయం చేరుకున్న ఉప ముఖ్యమంత్రికి జిల్లా కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ సుబ్బరాయుడు, తిరుపతి, శ్రీకాళహస్తి ఎమ్మెల్యేలు ఆరణి శ్రీనివాసులు, బొజ్జల సుధీర్ రెడ్డి, తిరుపతి సర్కిల్ అటవీ శాఖ సిసిఎఫ్ సెల్వం, జిల్లా అటవీ శాఖ అధికారి సాయిబాబా తదితరులు స్వాగతం పలికారు. మామండూరు అటవీ ప్రాంతాన్ని పరిశీలించే క్రమంలో ఆ ప్రాంతంలో అరుదుగా కనిపించే మొక్కలను మంత్రి పవన్ కళ్యాణ్ పరిశీలనాత్మకంగా చూసి వాటి గుణగణాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలానే స్మగ్లర్లు నరికి వేసిన ఎర్రచందనం చెట్లను పరిశీలించారు. వ్యూ పాయింట్ ద్వారా మామండూరు అటవీ ప్రాంతాన్ని పవన్ కళ్యాణ్ పరిశీలించారు. మామండూరు అటవీ ప్రాంతంలో సహజంగా పారే కాలువ వద్ద కొద్దిసేపు ఉపముఖ్యమంత్రి ఉల్లాసంగా గడిపారు. మామండూరు అటవీ క్షేత్ర ప్రాంతం విశిష్టతను అధికారులను అడిగి తెలుసుకున్నారు.

### వేలకోట్ల సంపద గోదాముల్లో..

మామండూరు అటవీ ప్రాంతం పర్యటన అనంతరం తిరుపతి–కరకంబాడి మార్గం తిమ్మి నాయుడు పాలెం వద్ద ఉన్న కేంద్రీయ ఎర్రచందనం గోదామును పరిశీలించారు. అక్కడ ఉన్న 5300 టన్నుల ఎర్రచందనం దుంగలను పరిశీలించిన మంత్రి వీటి అంచనా విలువ ఎంత ఉండొచ్చు అని అధికారులను అడగగా, 2 నుంచి 5 వేల కోట్ల రూపాయలు ఉంటుందని చెప్పడంతో పవన్ కళ్యాణ్ ఆశ్చర్యం వ్యక్తం చేశారు. కేంద్రీయ ఎర్రచందనం గోదాములలో ఉన్న ఎనిమిది గోదాములలో పట్టుబడిన ఎర్రచందనం రికార్డులను, ఎర్రచందనం ద్వారా ఉత్పత్తి చేసిన వివిధ రకాల వస్తువులను పరిశీలించడంతోపాటుగా వాటి మన్నికను అడిగి తెలుసుకున్నారు. గోదాములలో ఉన్న ఎర్రచందనంకు దాదాపుగా 28 లక్షల రూపాయల ఇన్సూరెన్స్ కూడా చేయించామని అధికారులు మంత్రికి వివరించారు. గోదాములలో నిల్వ ఉన్న ఎర్రచందనం ఏ, బి, సి, నాన్ గ్రేడ్లుగా విభజించామని, త్వరలోనే గ్లోబల్ టెండర్ల ద్వారా విక్రయాలు జరపడానికి పరిశీలనలు చేస్తున్నామని అధికారులు తెలిపారు.

## ఒకే వేదికపై తండ్రీకొడుకులు

### విధినిర్వహణలో అద్భుత దృశ్యం



**ప్రజాశక్తి -తిరుపతి టౌన్**

విధి నిర్వహణలో భాగంగా ఒకే వేదికపై తండ్రీ కొడుకులు కనిపించారు. తిరుపతిలో ఈ అద్భుత దృశ్యం ఆవిష్కతమైంది.రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి కొణిదెల పవన్ కళ్యాణ్ తిరుపతి పర్యటనలో భాగంగా తిరుపతి జిల్లా కలెక్టరేట్ నందు అటవీ శాఖాధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి వ్యక్తిగత కార్యదర్శి, స్పెషల్ గ్రేడ్ డిప్యూటీ కలెక్టర్ జి.ఆర్. మధుసూదన్ తన విధుల్లో భాగంగా పాల్గొన్నారు. అదే కార్యక్రమంలో ఆయన తండ్రి జి. రామచంద్ర, తిరుపతి అర్బన్ డిప్యూటీ తహసీల్దార్ పాల్గొన్నారు. విధి నిర్వహణ పరంగా ఒకే వేదికపై తండ్రి–కొడుకులు కలిసి పనిచేయడం అందరికీ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.పాలనాపరమైన ప్రభుత్వ సేవా బాధ్యతల్లో తండ్రి–కొడుకులు కర్తవ్యనిష్ఠతో వ్యవహరించడం ప్రభుత్వ యంత్రాంగంలో ఆదర్శంగా నిలుస్తుందని డిప్యూటీ సీఎం అభినందించారు.

## పవన్ పర్యటనలో నిరసన సెగ.....




ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ పర్యటన సందర్భంగా జిల్లా కలెక్టరేట్ వద్ద శ్రీకాళహస్తి జనసేన పార్టీ మాజీ ఇన్చార్జి వినుత డ్రైవర్ రాయుడు హత్య ఉదంతంలో బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని, రాయుడు కుటుంబాన్ని ఆదుకోవాలని ప్లే కార్డులు ప్రదర్శించి రాయుడు కుటుంబ సభ్యులు నిరసన తెలిపారు. వీరిని గమనించిన పోలీసులు పక్కకు తీసుకెళ్లిపోయారు. తిమ్మినాయుడుపాలెం వద్ద స్మశాన వాటిక ఏర్పాటు సమస్య ఉందని, అటవీ భూభాగంలో స్మశాన వాటిక ఏర్పాటుకు తగిన చర్యలు తీసుకోవాలని అక్కడి ప్రజలు పవన్ కళ్యాణ్ పర్యటనలో విజ్ఞప్తి చేయడానికి ప్రయత్నాలు చేశారు. కలెక్టరేట్లో రాష్ట్ర ప్రభుత్వ కార్యక్రమంగా ప్రకటించబడిన శ్రీ భక్త కనకదాస 538వ జయంతి సందర్భంగా పవన్ కళ్యాణ్ ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి పుష్పాంజలి ఘటించారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ వెంట అటవీ శాఖ ప్రిన్సిపల్ పిసిసిఎఫ్ చలపతిరావు, ప్రభుత్వ అటవీ శాఖ సలహాదారు మల్లిఖార్జున రావు, ఓఎస్ డి శివరాం ప్రసాద్, తిరుపతి జిల్లా కలెక్టర్ డాక్టర్ ఎస్ వెంకటేశ్వర్, తిరుపతి జిల్లా ఎస్పీ, టాస్క్ ఫోర్స్ హెడ్ సుబ్బరాయుడు, చిత్తూరు జిల్లా ఎస్పీ తుషార్ డూడీ, తిరుపతి సర్కిల్ సిసిఎఫ్ సెల్వం, జిల్లా అటవీ శాఖ అధికారి సాయిబాబా, రెడ్ శాండర్స్ గోదాముల డిఎఫ్ఓ రవిశంకర్ శర్మ అటవీశాఖ అధికారులు పాల్గొన్నారు.

## నేడు 'ముసలిమడుగు'లో పర్యటన





**ప్రజాశక్తి - పలమనేరు**

ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ ఆదివారం పలమనేరు మండలంలో పర్యటించనున్నారు. తన పర్యటనలో భాగంగా తిరుపతి విమానాశ్రయం నుండి బయల్దేరి ఉదయం 10.35 గంటలకు పలమనేరు మండలం పెంగరగుంటకు చేరుకుంటారు. అనంతరం రోడ్డు మార్గాన బయల్దేరి 10.50 గంటలకు పలమనేరు సమీపంలోని ముసలిమడుగు ఏనుగు శిబిరం చేరుకుని మానవ – వన్యప్రాణి ఘర్షణ నిర్వహణ, కుంకి ఏనుగుల శిక్షణ శిబిరాన్ని సందర్శించి మొక్కలు నాటతారు. కార్యక్రమం అనంతరం కుంకీ ఏనుగుల శిబిరం, గజారామము నగర వనాన్ని ఉపముఖ్యమంత్రి ప్రారంభిస్తారన్నారు. తదుపరి రైతులతో ముఖాముఖి నిర్వహిస్తారు. మధ్యాహ్నం 12.45 గంటలకు ముసలిమడుగు నుండి పెంగరగుంట హెలిప్యాడ్ చేరుకుని తిరుపతి విమానాశ్రయంకు బయల్దేరి వెళతారు.

## పవన్‌కు బొజ్జల స్వాగతం



**ప్రజాశక్తి-శ్రీకాళహస్తి:**

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, అటవీ శాఖామాత్యులు పవన్ కళ్యాణ్‌కు స్థానిక రేణిగుంట విమానాశ్రయంలో శ్రీకాళహస్తి ఎమ్మెల్యే బొజ్జల వెంకట సుధీర్ రెడ్డి స్వాగతం పలికారు. పవన్ కళ్యాణ్ శనివారం జిల్లా పర్యటన నిమిత్తం రేణిగుంటకు చేరుకోగా సుధీర్ రెడ్డి మర్యాదపూర్వకంగా కలిసారు.

# కుప్పం అభివృద్ధిపై చర్చ జరగాలి

## రూ.2,203 కోట్లతో ఏడు పరిశ్రమలు

## వర్చువల్‌గా చంద్రబాబు శంకుస్థాపన

## వందశాతం సోలార్ పవర్

## త్వరలోనే మరో ఎనిమిది ఫ్యాక్టరీలు

**ప్రజాశక్తి - కుప్పం**

'కుప్పంలో జరుగుతున్న అభివృద్ధిపై ఇంటింట చర్చ జరగాలి' అని ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు అన్నారు. రూ.2,203 కోట్లతో ఏడు పరిశ్రమలకు వర్చువల్‌గా శనివారం శంకుస్థాపన చేశారు. సంజీవని పైలెట్ ప్రాజెక్టును కుప్పంలోనే అమలు చేస్తున్నామన్నారు. కుప్పం నియోజకవర్గాన్ని వందశాతం సోలార్ పవర్ వినియోగించుకునే నియోజకవర్గంగా చేస్తామన్నారు. త్వరలో రూ.6,339 కోట్ల పెట్టుబడితో ఎనిమిది సంస్థలు కుప్పానికి రానున్నాయని చెప్పారు. దీంతో ప్రత్యక్షంగా, పరోక్షంగా 43వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు లభిస్తాయని తెలిపారు. చంద్రబాబు మాట్లాడుతూ స్పేస్‌సిటీ, డ్రోన్‌సిటీ, ఎరో స్పేస్‌సిటీలను ఏర్పాటు చేయనున్నట్లు చెప్పారు.



కుప్పంలో కార్యక్రమానికి హాజరైన కలెక్టర్, ఇతర అధికారులు, నాయకులు

ఒకప్పుడు కుప్పం అత్యంత వెనుకబడిన ప్రాంతమని, ఇపుడు అభివృద్ధి చెందుతోందన్నారు. హిందాల్కో, శ్రీజా డెయిరీ, ఏస్ ఇంటర్నేషనల్, ఎస్‌విఎఫ్ సోయా, మదర్ డెయిరీ, మహిళా పార్కు వచ్చాయన్నారు. రూ.586 కోట్ల పెట్టుబడులతో హిందాల్కో సంస్థ మొబైల్, ల్యాప్‌టాప్, టెక్ పరికరాల భాగాల తయారీలో ప్రసిద్ధి చెందిందన్నారు. ఆదిత్యా బిర్లా సంస్థ స్కిల్ డెవలప్‌మెంట్‌లో శిక్షణ ఇస్తుందని, దీనివల్ల యువతకు మెరుగైన అవకాశాలు లభిస్తాయన్నారు. శ్రీజ డెయిరీ సమీకృత డెయిరీ, పశువుల మేత ప్లాంటును రూ.290 కోట్లతో చేపడుతోందన్నారు. నాలుగు లక్షల లీటర్లను శ్రీజ డెయిరీ కొనుగోలు చేసుతందన్నారు. ఏస్ ఇంటర్నేషనల్ సంస్థ డెయిరీ ప్రొటీన్ తయారీలో ప్రపంచ ప్రమాణాలను పాటిస్తుందన్నారు. ఎగుమతుల హబ్‌గా కుప్పాన్ని తీర్చిదిద్దే సామర్థ్యం ఈ సంస్థకు ఉందన్నారు. గ్రీన్ ఫీల్డ్ డెయిరీ ఉత్పత్తుల కాంప్లెక్స్‌ను రూ.525 కోట్ల పెట్టుబడితో స్థాపించేందుకు ముందుకొచ్చిందన్నారు. రూ.373 కోట్ల వ్యయంతో సోయా సంస్థ వంటనూనెల తయారీ, సోయా ప్రోటీన్ యూనిట్ ఏర్పాటు చేయనుంది. రూ.260 కోట్ల పెట్టుబడితో మదర్ డెయిరీ సంస్థ జ్యూస్, జామ్, పల్ప్‌యూనిట్‌తో పండ్ల రైతులకు ప్రపంచ మార్కెట్‌ను పరిచయం చేస్తుందన్నారు. రూ.200 కోట్లతో ఎలక్ట్రిక్ వెహికల్స్ కేంద్రాన్ని ఏర్పాటు చేస్తుందన్నారు. 'అలీప్' మహిళా పార్కు ద్వారా మహిళా పారిశ్రామికవేత్తలకు ఉపయోగపడేలా రూ.27 కోట్లతో 40వేల చదరపు అడుగుల విస్తీర్ణంలో పార్క్ అభివృద్ధి చేస్తున్నామన్నారు. నాలుగువేల మంది మహిళలకు ఉపాధి, శిక్షణ లభిస్తుందన్నారు. ప్రత్యక్షంగా, పరోక్షంగా 22,300 మందికి ఉద్యోగాలు లభిస్తాయన్నారు.

ఈ కార్యక్రమంలో కలెక్టర్ సుమిత్ కుమార్, కడ పీడీ వికాస్ మర్మత్, ఆర్టీసీ వైస్‌ఛైర్మన్ మునిరత్నం, పికెఎం ఉడా ఛైర్మన్ డాక్టర్ సురేష్‌బాబు, రెస్కో ఛైర్మన్ ప్రతాప్, మార్కెట్ కమిటీ ఛైర్మన్ రాజు, మున్సిపల్ ఛైర్మన్ సెల్వరాజ్, కడ అడ్వైజర్ కమిటీ సభ్యులు రాజ్‌కుమార్, మున్సిపల్ అధ్యక్షులు కాణిపాకం వెంకటేష్, మండల అధ్యక్షులు సుబ్రమణి, రాజగోపాల్, ఉదయ్‌కుమార్, మాజీ జడ్‌పిటిసి బెటప్పనాయుడు తదితరులు పాల్గొన్నారు.

**ఎల్ఈడి స్క్రీన్ ద్వారా వీక్షించిన కూటమి నేతలు**

**రామకుప్పం:** కుప్పం నియోజకవర్గంలో రాష్ట్ర సీఎం చంద్రబాబు నాయుడు ఏడు పరిశ్రమలకు వర్చువల్ ద్వారా శనివారం శంకుస్థాపన చేశారు. పోలీస్ స్టేషన్ సర్కిల్ వద్ద ఎల్ఈడి స్క్రీన్ ద్వారా ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. కూటమి నేతలు మాట్లాడుతూ... మారుమూల ప్రాంతమైన కుప్పం నియోజకవర్గంలో ఉద్యోగాల కోసం బెంగళూరు, చెన్నై ఇతర రాష్ట్రాలకు వలస వెళ్తుంటారని, సీఎం చొరవతో నియోజకవర్గంలో ఏడు పరిశ్రమలు స్థాపించి నిరుద్యోగులకు మెండుగా ఉపాధి అవకాశాలు కల్పించేందుకు అహర్నిశల కషి చేశారన్నారు. 2027 నాటికి పరిశ్రమలు స్థాపనతో నియోజకవర్గం దశ దిశ మారిపోతుందన్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర నేతలు మునస్వామి, నారాయణ చారి, మండల అధ్యక్ష, మాజీ అధ్యక్షులు వెంకటరమణ, ఆనంద రెడ్డి, ఆంజనేయ రెడ్డి, నరసింహులు, సీతాపతి పాల్గొన్నారు.

### కుప్పంలో 15 నెలల్లో 16 పరిశ్రమలు
### - ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్

**కుప్పం:** కుప్పం నియోజకవర్గంలో ప్రభుత్వ అధికారంలోకి వచ్చిన 15 నెలల్లో 16 పరిశ్రమలను ఏర్పాటు చేశారని ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ పేర్కొన్నారు. కుప్పంలో పరిశ్రమలకు సీఎం చంద్రబాబు వర్చువల్ విధానంలో శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా పొగరుపల్లి ఇండస్ట్రీయల్ ఏరియాలో పలు పరిశ్రమలకు శంకుస్థాపన సందర్భంగా వర్చువల్ విధానంలో యువత, మహిళలు రైతులతో సీఎం ముఖాముఖి అయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ కంచర్ల శ్రీకాంత్ మాట్లాడుతూ.. ఎన్నికల సమయంలో బెంగళూరులో ఉన్న కుప్పం వాసులను ఓట్లు అడిగేందుకు వెళ్లగా తాము వందశాత చంద్రబాబుకు ఓట్లు వేస్తామని అయితే కుప్పంలో పరిశ్రమలు ఏర్పాటు చేస్తే తమకు ఉపాధి కల్పించాలని కోరారని అందులో భాగంగా ఎన్నికల మేనిఫెస్టోలో 30 వేల మందికి ఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పిస్తామని హామీ ఇచ్చామని ఆ హామీని 15 నెలల్లోనే పూర్తి చేయడం ఎంతో సంతోషంగా ఉందన్నారు. కుప్పం ప్రాంత సమగ్ర అభివృద్ధికి కడ ఎంతగానో కృషి చేస్తోందని కడ పీడీ వికాస్ మర్మత్‌ను ఎమ్మెల్సీ అభినందించారు. కుప్పం ప్రాంతాన్ని అన్ని విధాలుగా రాష్ట్రానికి ఆదర్శంగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు ఎంతో కృషి చేస్తున్నారని ఆయన అడుగుజాడల్లో ముందుకు సాగుతున్నట్లు ఎమ్మెల్సీ పేర్కొన్నారు.



రామకుప్పంలో హాజరైన కూటమి నేతలు



అండర్ 17 జిల్లా కోకో జట్టుకు ఎంపికైన బాలబాలికలు

## అండర్ 17 జిల్లా కోకో జట్టు ఎంపిక

**ప్రజాశక్తి -బంగారుపాళ్యం:** అండర్ 17 జిల్లా కోకో జట్టును ఎంపిక చేశామని డిఎస్ డిఓ బాలాజీ పేర్కొన్నా రు. శనివారం మండ లంలోని మంగళపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జిల్లా కోకో జట్టు ఎంపిక నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా నుండి బాల బాలికలు 240 మంది పాల్గొన్నారని, జిల్లా టీమును ఎంపిక చేశామన్నారు. ఈనెల 22 నుండి 24 వరకు కాకినాడలో నిర్వహించే రాష్ట్ర జట్లలో పాల్గొం టారన్నారు. ఈ కార్యక్రమంలో సర్పంచి కుప్పలపల్లి మురళి ఎంఈఓలో నాగేశ్వర రావు రమేష్ ప్రధానోపాధ్యాయులు రాజ్యలక్ష్మి టిడిపి మండల అధ్యక్షులు ధరణి ప్రసాద్, ఎస్ఎంసి చైర్మన్ రమేష్, ఎస్జీఎఫ్ కార్యదర్శి శారద, కోకో సంఘ కార్యదర్శి శరత్ బాబు, పలువురు వ్యాయామ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

# ఏనుగుల గుంపు దాడి

- వరి, టమాటా, మామిడి పంటలు ధ్వంసం
- అపార నష్టం, పరిహారం కోసం ఎదురుచూపు



ఏనుగుల దాడిలో ధ్వంసమైన వరి పంట

**ప్రజాశక్తి - రొంపిచర్ల:** గత కొద్ది రోజులుగా పులిచెర్ల మండలంలో ఏనుగులు బీభత్సం సృష్టిస్తున్నాయి. నిత్యం రాత్రి వేళ్లో ఏనుగులు పంట పొలాలపై పడి ధ్వంసం చేస్తున్నాయి. రైతులు తమ పంటపొలాల వద్దకు వెళ్లేందుకు భయాందోళనకు గురవుతు న్నారు. ఏనుగుల దాడులు నిరోధానికి పలమనేరు ముసలి మడుగులో నేడు కుంకి ఏనుగుల శిబిరం, గజారామం, నగరవనంను ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ ప్రారంభించనున్న నేపథ్యంలో తమకు ఏనుగల దాడుల నుంచి ఉపశమనం లభిస్తుందని రైతులు ఆశతో ఎదురుచూస్తున్నారు.

పులిచెర్ల మండలం దేవలంపేట పంచాయతీలో క్రమం తప్పకుండా ప్రతిరోజూ ఏనుగుల గుంపు దాడులతో రైతులు తీవ్ర నష్టానికి గురవుతున్నారు. నిత్యం జరిగే దాడుల్లో భాగంగా శనివారం తెల్లవారుజామున సైతం పంటలపై ఏనుగుల గుంపు దాడి చేసింది. రిజర్వ్ ఫారెస్ట్ ప్రాంతం నుంచి బయలుదేరిన ఏనుగుల గుంపు దేవళంపేట సరిహద్దు లోని గండేవారిపల్లి సమీపానికి చేరుకుని గ్రామ రైతులకు చెందిన వరి పంట, టమోటా, మామిడి చెట్ల పై 16 ఏనుగుల గుంపు దాడి చేసి రైతులకు అపార నష్టం మిగిల్చాయి. అటవీ శాఖ అధికారులు నాశనమైన పంటలను పరిశీలించి రైతులకు నష్టపరిహారం అందిస్తామని హామీ ఇచ్చారు. ఈ నేపథ్యంలో నేడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ రానున్న నేపథ్యంలో తమకు న్యాయం జరుగుతుందని రైతులు నిరీక్షిస్తున్నారు.



మాట్లాడుతున్న ఎంఆర్‌పిఎస్ నాయకులు మందకృష్ణమాదిగ

### జస్టిస్ గవాయ్‌పై దాడికి నిరసనగా..

## 17న చలో ఢిల్లీ

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:**

జస్టిస్ గవాయ్‌పై దాడిని నిరసిస్తూ ఈనెల 17వ తేది చలోఢిల్లీ నిర్వహిస్తున్నట్లు మాదిగ రిజర్వేషన్ పోరాటసమితి జాతీయ నాయకులు మందకృష్ణమాదిగ తెలిపారు. స్థానిక అంబేద్కర్ భవన్‌లో శనివారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లా డుతూ దళితుడు కావడం వల్లే సుప్రింకోర్టు సాక్షిగా గవాయ్‌పై దాడి జరిగి నెలరోజులకు పైగా అవుతున్నా ఇప్పటివరకు కేసు నమోదు చేయడం లేదన్నారు. ఈ సంఘటనలపై పోలీస్, న్యాయ వ్యవస్థ, మానవహక్కుల కమిషన్ పూర్తిగా విఫలమైం దన్నారు. దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు దాడిని తీవ్రంగా ఖడించిన విషయాన్ని గుర్తు చేశారు. సుమో టోగా స్వీకరించి ఇలాంటి సంఘట నలు పురావృతం కాకుండా న్యాయ మూర్తి దాడి చేసిన వ్యక్తిపై కేసు నమోదు చేసి శిక్షించా లన్నారు. ఈ సమావేశంలో ఎంఆర్‌పిస్ జిల్లా నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

# వణికిస్తున్న ఏనుగులు!

## - వందలాది ఎకరాల పంటలకు నష్టం

ప్రజాదృష్టి

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:** జిల్లాను ఏనుగులు వణికిస్తు న్నాయి. వందలాది ఎకరాల్లో పంటలు ఏనుగుల దాడుల్లో నాశనం అవుతున్నాయి. ఏనుగుల దాడుల్లో పంట నష్టపోయిన రైతులకు పరిహారం అంతత మాత్రంగా ఉంటోంది. జిల్లాలోని పలమనేరు, వీకోట, పంజాణి, బంగారుపాళ్యం, యాదమరి, గుడిపాల, పులిచర్ల ఇతర అటవీ సమీప ప్రాంతాల్లో ఏనుగుల దాడులు నిత్యకృత్యంగా మారాయి. పలమనేరులో ఒంటరి ఏనుగు సృష్టించిన బీభత్సం అంతా ఇంతా కాదు.. అటవీశాఖ అధికారి సుకుమార్‌పై దాడి చేసి తీవ్రంగా గాయపరిచింది.

రెండేళ్ల క్రితం గుడిపాల మండలం 190 రామాపురం సీకే పల్లిలో వ్యవసాయం చేసుకుంటున్న దంపతులు వెంకటేష్, శెల్విపై దాడి చేసిన ఒంటరి ఏనుగు కాళ్లతో తొక్కి చంపేసింది. కాపాడేందుకు ప్రయ త్నించిన యువకుడు కార్తీక్‌పై దాడి చేయడంతో తీవ్రంగా గాయపడ్డాడు. పులిచర్ల అటవీ ప్రాంతంలోనూ ఏనుగు సంచారంతో అక్కడి రైతులు అటవీ సమీపంలోని పొలాలకు వెళ్లేందుకు బిక్కుబిక్కుమంటూ అటువైపు వెళ్లడం మానేశారు. ఏడాదిన్నర క్రితం ఐరాల మండలంలో ఓ చిరుత ఆవుపై దాడి చేసి చంపేసింది. రెండు రోజుల క్రితం ఆదే ఐరాల మండలం వంద్రం పల్లిలో చిరుతపులి దూడపై దాడి చేసి చంపేసింది. ఇలా జిల్లాలో వరుస దాడులు చోటు చేసు కుంటు న్నాయి. పలమనేరు ఘాట్ రోడ్డులో రోడ్డు దాటుతూ, అటవీ సమీప పొలాల్లో గుంపులు గుంపులుగా ఏనుగులు సంచరిస్తున్నాయి. కైండిన్య నది అటవీ పరిసర ప్రాంతాల నుండి ఏనుగుల గుంపులు పలమనేరు అటవీ ప్రాంతం మీదుగా జిల్లాలో ప్రవేశిస్తున్నట్లు అటవీశాఖ అధికారులు అంచనా వేస్తున్నారు. ప్రస్తుతం జిల్లాలో సుమారు 120 వరకు ఏనుగుల సంచారం ఉన్నట్లు అంచనా వేస్తున్నారు. డ్రోన్ కెమెరాలు, సీసీ కెమెరాల ద్వారా ఏనుగుల సంచారం, సంఖ్యను లెక్కిస్తారు.



ఇటీవల పులిచర్ల ప్రాంతంలో సంచరిస్తున్న ఏనుగులు (ఫైల్ ఫోటో)

ఏనుగుల సంచారం ఏటు వైపుగా పయనిస్తున్న విషయాన్ని ముందుగా అటవీశాఖ అధికారులు సీసీ , డ్రోన్ కెమెరాల ద్వారా గుర్తించి సమీప అటవీ, గ్రామాల ప్రజలను అప్రమత్తం చేయాల్సి ఉంటుంది. గుంపు నుండి తప్పి పోయిన ఏనుగులు గుంపును వెతుక్కుం టూ అటవీ సమీప పంట పొలాలు, జనావాసాలు, ప్రజలపై దాడులు చేసే అవకాశం ఎక్కువగా ఉంటోంది. ఇలా జిల్లాలోని పలమనేరు గంటావూరు, గుడిపాల రామాపురం, పులిచర్లలో చోటు చేసుకున్న సంఘటనలు అనేకం వున్నాయి. నియంత్రణ కోసం ప్రభుత్వం, అటవీ శాఖ, అటవీ పరిసర ప్రాంతాల్లో కందకాలు ఏర్పాటు చేయడంతో పాటు వన్యప్రాణుల కోసం అడవిలో తాగునీటి గుంటలు ఏర్పాటు చేయాలి. ఎప్పటి నుండో అటవీ సమీప ప్రాంతాల రైతులు కోరుతున్నట్లు సోలార్ ఫెన్సింగ్ ఏర్పాటు చేయాలి.. ఏనుగుల దాడుల్లో పంట నష్టపోతున్న రైతులకు నష్టపరిహారం చెల్లించాలి. ప్రాణాలు కోల్పోతున్న రైతులకు ఇచ్చే పరిహారం పెంచాలి.

# జర్నలిజం పేరుతో ఉద్యోగులను వేధిస్తే చర్యలు

**ప్రజాశక్తి - చిత్తూరు అర్బన్:** జర్నలిజం పేరుతో ఉద్యోగులను వేధించడం తగదని, అలా బ్లాక్ మెయిల్ చేసే విలేకరులపై తగిన చర్యలు తప్పవని చిత్తూరు కలెక్టర్ సుమిత్ కుమార్ శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉద్యోగుల ప్రయోజ నాలను కాపాడటం, వారిని బ్లాక్ మెయిల్ చేయకుండా కార్యాలయంలోని సిబ్బంది నిర్భయంగా పని చేసుకునే వాతావరణం కల్పించడం తన బాధ్యత అని కలెక్టర్ తెలిపారు. ఇద్దరు స్థానిక పాత్రికేయులు కార్యాలయంలోని మహిళా ఉద్యోగులతో సహా ప్రభుత్వ ఉద్యోగులను పదేపదే బ్లాక్ మెయిల్ చేశారని,

## ఒకరి అక్రిడిటేషన్ రద్దు: కలెక్టర్

బెదిరించడానికి ప్రయత్నించారని తన దృష్టికి వచ్చిందని కలెక్టర్ తెలిపారు. ఈ సంఘటనపై పూర్తి స్థాయిలో విచారించి ఆ ఇద్దరిలో ఒకరి అక్రిడిటేషన్ కార్డు కలిగిన వారు వారి కార్డును రద్దు చేశామన్నారు. పౌరులు, ఉద్యోగుల ప్రయోజనాలను కాపాడటానికి అవసరమైన అన్ని చర్యలు తీసుకుంటామని కలెక్టర్ ప్రకటనలో తెలిపారు.


రోడ్డును ప్రారంభిస్తున్న ఎమ్మెల్సీ శ్రీకాంత్

## సిమెంట్ రోడ్డు నిర్మాణం ప్రారంభం

**ప్రజాశక్తి -గుడిపల్లి:** మండలంలోని పలమనేరు నేషనల్ హైవే నుండి నలగంపల్లి వరకు రూ.35 లక్షలతో చేపట్టిన సిసి రోడ్డు నిర్మాణానికి కుప్పం నియోజకవర్గ సమన్వయ కమిటీ చైర్మన్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ శనివారం భూమి పూజ నిర్వహించి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు పాలనలో కుప్పం నియోజకవర్గంలోని గ్రామాలు, అటవీ సరిహద్దు గ్రామాలకు రోడ్డు సౌకర్యం ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. ప్రస్తుతం రోడ్లను అభివృద్ధి చేయడంతో పాటు గత రోడ్లను మరింత అభివృద్ధి చేసేందుకు కృషి చేస్తు న్నామన్నారు. ముఖ్యమంత్రికి కృతజ్ఞతలు తెలుపు తున్నామన్నారు. ఈ కార్యక్రమంలో కుప్పం నియోజకవర్గ ఇన్‌ఛార్జి ఎపిఎస్ఆర్‌టిసి ఉపాధ్యక్షులు పిఎస్ మునిరత్నం, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి, పికెఎంయుడిఎ చైర్మన్ డాక్టరు సురేష్ బాబు, గుడుపల్లి మండల పార్టీ అధ్యక్షులు సుబ్రమణి, రాష్ట్ర వాల్మీకి డైరెక్టర్ బాబు నాయుడు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ చంద్రశేఖర్, వెంకటేష్, ఎంపీటీసీ తులసి, క్లస్టర్ ఇన్‌ఛార్జీలు, యూనిట్ ఇన్‌ఛార్జీలు, టిడిపి ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.


మాజీ సర్పంచ్‌కు నివాళులర్పిస్తున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి

## మాజీ సర్పంచ్‌కు నివాళి


**ప్రజాశక్తి - ఎస్ఆర్ పురం :** ఎస్ఆర్ పురం మండలంలోని వెంకటాపురంలో మాజీ సర్పంచ్ చంద్రగిరి వెంకటేష్ అలియాస్ మోషే శుక్రవారం అనారోగ్యంతో మృతి చెందారు. ఈ సమాచారం తెలుసుకున్న మాజీ డిప్యూటీ సీఎం నారాయణస్వామి శనివారం వెంకటాపురం గ్రామానికి చేరుకుని మాజీ సర్పంచ్ భౌతిక కాయానికి పూలమాలవేసి నివాళులర్పించారు. సమితి ప్రెసిడెంట్ గా ఉన్న సమయంలో ఆయనతో ఉన్న అనుబంధాన్ని గుర్తు చేసుకున్నారు. బాధిత కుటుంబ సభ్యులు చంద్రగిరి తంభయ్య సోదరులు, సర్పంచ్ సతీమణిని ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వైసీపీ నాయకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


మందకృష్ణమాదిగను కలిసిన నాయకులు

## మందకృష్ణ మాదిగను కలిసిన నాయకులు

**ప్రజాశక్తి- రామకుప్పం:** సుప్రీంకోర్టు ప్రధాన న్యాయమూర్తి బిఆర్‌గవాయిపై దాడిని ఖండిస్తూ నవంబర్ 17 న నిర్వహించనున్న చలో ఢిల్లీ విజయవంతం కోసం చిత్తూరు జిల్లా సమీక్షకు వచ్చిన ఉద్యమ నేత మందకృష్ణ మాదిగను రామకుప్పం ఎంఆర్‌పిఎస్, ఎంఎస్‌పి మైనార్టీ నేతలు పూలమాలలు వేసి ఘన స్వాగతం పలికారు. ఆయన పిలుపుమేరకు ఉమ్మడి చిత్తూరు జిల్లానుండి 'చలో ఢిల్లీ' కార్యక్రమానికి భారీ సంఖ్యతో బయలుదేరి విజయవంతం చేయాలని కోరారు. జిల్లా సమావేశంలో కుప్పం నియోజకవర్గం, రామకుప్పం మండలం ఎంఆర్‌పిఎస్, ఎం ఎస్‌పి, నూతనంగా ఎన్నుకున్న ఎంఎస్‌పి మైనార్టీ మండల కమిటీ నాయ కులు మందకృష్ణ మాదిగతో కలిసి మైనార్టీ సోదరులు గజమాల వేసి, శాలువాకప్పి సన్మానించారు. ఈ కార్యక్రమంలో చిత్తూరు జిల్లా ఇన్‌చార్జ్ ధనరాజ్, పల్లి కిషోర్, జిల్లా అధ్యక్షులు ఎంపీ ప్రకాష్, కుప్పం కో ఇన్‌ఛార్జి పి వెంకటేష్, పాపన్న, గోవింద, జయప్ప, విజయ్, పలని, ఎంఎస్‌పి మైనార్టీ అధ్యక్షులు నాసిర్ బాష, రియాజ్ బాషా, అలీ బాష, పిద్దు బాష పాల్గొన్నారు.

## దారి సమస్యను పరిష్కరించండి
### మంత్రి పవన్ కల్యాణ్‌కు వినతి


కోతి గుట్ట సుబ్రమణ్యం

**ప్రజాశక్తి-పలమనేరు:** చిత్తూరు జిల్లా పలమనేరు నుండి చిత్తూరుకు మార్గంలో జాతీయ రహదారిపై వున్న మొగిలేశ్వర దేవాలయం నుండి అటవీ ప్రాంతంలోని దేవరకొండకు ప్రతి పౌర్ణమి కార్తీకదీపం రోజు విశేషంగా అధిక సంఖ్యలో భక్తులు వెళ్లి దర్శించుకుంటారని, కానీ మొగిలి నుండే దేవరకొండకు వెళ్లడానికి దారి సమస్య వుందని దీన్ని పరిష్కరించాలని భక్తులు కోరుతున్నారు. ఈ సమస్యను కొద్దిమంది దాతలు సహాయంతో అనేకమార్లు ఆ మట్టి రోడ్డును మనమ్మతులు చేస్తూ ఉన్న వర్షం కారణంగా దారి కొట్టుకుపోతోందని భక్తులు తమ వాహనాల్లో దేవరకొండ పైకి వెళ్లడానికి చాలా ఇబ్బంది పడుతున్నారన్నారు. ఈ దారిలో దాదాపు మూడు కిలోమీటర్ల 150 మీటర్ల దూరం దారి అటవీ శాఖ పరిధిలో ఉన్నకారణంగా అక్కడ పక్క రోడ్డు నిర్మించడానికి అటవీ శాఖ నుండి ఆటంకాలు ఏర్పడుతు న్నాయన్నారు. దీనికి సంబంధించిన ఫైల్ గుంటూరులోని సిసిఎఫ్ ఆఫీసులో డీజీపీ సర్వే కోసం పెండింగ్‌లో ఉన్నట్లు తెలుపు తున్నారన్నారు. అనేక పర్యాయాలు భక్తులు అభ్యర్థించినా ఇంత వరకు డిజిపి సర్వే పూర్తి కాలేదని దేవరకొండ భక్తులు తరపున సేవకుడు కోతి గుట్ట సుబ్రమణ్యం తెలిపారు. పవన్ కళ్యాణ్ పలమనేరుకు వస్తున్న సందర్భంగా దేవరకొండ భక్తులు వారిని కలవడానికి కూడా ప్రయత్నిస్తున్నట్లు తెలిపారు. పలమనేరుకు రానున్న అటవీ శాఖ మంత్రి పవన్ కళ్యాణ్ దేవరకొండ భక్తులకు దారి సమస్యకు పరిష్కార మార్గం చూపించాలని కోరుతున్నారు.

## విద్యకు రూ.10 వేలు ఆర్థిక సాయం



**ప్రజాశక్తి -యాదమరి:** మండలం లోని చిన్నం పల్లి గ్రామానికి చెందిన ఇద్దరు విద్యార్థులకు పదివేల రూపాయల ఆర్థిక సాయం అందించారు. కీ నాటం పల్లి గ్రామానికి చెందిన చిత్తూరు జిల్లా తెలుగు యువత అధికార ప్రతినిధి వల్లే అమర నాథ నా యుడు, ఎల్ వే ణు గో పా ల్, చిన్నంపల్లి గ్రామానికి చెందిన సురేష్ పిల్లలకు చదువుల నిమిత్తం ఆర్థిక సాయం అందించారు.


కనకదాసుకు నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అమరనాథరెడ్డి

## ఘనంగా కనకదాసు జయంతి

**ప్రజాశక్తి-పలమనేరు:** పలమనేరు టిడిపి కార్యాలయంలో కనకదాస జయంతి వేడుకలు శనివారం ఘనంగా నిర్వహించారు. పలమ నేరు కురబ సంఘ నాయకుల ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి స్థానిక ఎమ్మెల్యే అమరనాథరెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా కనకదాస చిత్రపటానికి పూజలు చేసి నివాళులు అర్పించారు. కనకదాసు చూపించిన మంచి మార్గంలో అందరూ నడిచి ఆయన ఆశయాలకు అనుగుణంగా పని చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. ప్రభుత్వం కనకదాసు జయంతిని అధికారికంగా నిర్వహిస్తోందన్నారు. ఈ కార్యక్ర మంలో రాష్ట్ర కురబ కార్పొరేషన్ డైరెక్టర్ సుబ్రహ్మణ్యం గౌడు, కురబ సంఘ నాయకులు సోమశేఖర్ గౌడ్, బత్తి గౌడు, నాగభూషణం, సుబ్బన్న, ఈశ్వర్ గౌడ్, శివ, విశ్వనాధ, చలపతి, లతో పాటు కూటమి నాయకులు ఆర్‌వి బాలాజీ, రామచంద్ర నాయుడు, బ్రహ్మయ్య, దిలీప్ కుమార్, విజయ్ పాల్గొన్నారు.


పారిశుధ్యం పనులు నిర్వహిస్తున్న దృశ్యం

## పారిశుధ్యం పనులు వేగవంతం

**ప్రజాశక్తి-బైరెడ్డిపల్లి:** మండలంలోని గంగినాయనపల్లి ఎస్‌సి కాలనీలో అధికారుల ఆదేశాల మేరకు 'క్లీన్ అండ్ గ్రీన్' కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఇటీవల గ్రామంలో నిర్వహించిన ఎస్సీ, ఎస్టీ మానిటరింగ్ కమిటీ సమావేశంలో గ్రామస్థులు కాలనీలోని డ్రైనేజీలు అపరిశుభ్రంగా వున్నాయని ఫిర్యాదు చేశారు. స్పందించిన అధికారులు పంచాయతీ కార్యదర్శి, సచివాలయ సిబ్బందికి ఆదేశాలు జారీ చేశారు. గ్రీన్ అంబాసిడర్ల సహకారంతో శనివారం ఉదయం కాలనీలోని అన్ని డ్రైనేజీలను శుభ్రపరిచారు. ఎస్సీ కాలనీవాసులు ఆనందం వ్యక్తం చేశారు.



ఎమ్మెల్యే సమక్షంలో టిడిపిలో చేరుతున్న వైసిపి నాయకులు

## టిడిపిలో వైసీపీ నాయకుల చేరిక

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్ :** గుడిపాల మండలం చీలాపల్లి గ్రామ పంచాయతీ రాసనపల్లి గ్రామానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు, కార్యకర్తలు ఎమ్మెల్యే గురజాల జగన్ మోహన్ సమక్షంలో టిడిపిలో చేరారు. టిడిపి పార్లమెంటరీ పార్టీ ఎస్సీ సెల్ అధ్యక్షులు పీటర్ ఆధ్వర్యంలో రాసనపల్లి గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు సునీల్, రూబన్, శ్రీధర్, బాబు, మరో 20 మంది యువకులు శనివారం చిత్తూరులో ఎమ్మెల్యే సమక్షంలో టిడిపిలో చేరారు. వారికి టిడిపి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో స్థానిక నాయకులు పాల్గొన్నారు.


కళాజాతా ద్వారా అవగాహన కల్పిస్తున్న కళాకారులు

## కళాజాతా ద్వారా అవగాహన

**ప్రజాశక్తి -కుప్పం:** ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని కోరుతూ కుప్పం ఏరియా డెవలప్‌మెంట్ అథారిటీ ఆధ్వర్యంలో కళాజాతా ద్వారా గ్రామీణులకు శనివారం అవగాహన కల్పించారు. ఇందులో భాగంగా కుప్పం మండలం మల్లానూరు, వాన గుట్టపల్లి పంచాయతీల పరిధిలో కళాజాత ద్వారా అవగాహన నిర్వహించారు. స్వచ్ఛ కుప్పం, స్వర్ణకుప్పం పై ప్రజలకు అవగాహన కల్పిస్తూ ప్రతి ఒక్కరూ మరుగుదొడ్లను వాడాలని సూచించారు. స్వచ్ఛ కుప్పంలో గ్రామీణులు సైతం భాగస్వాములు అవుతూ తమ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకుని వ్యక్తిగత పరిశుభ్రతను పాటించాలని ఎంపీడీవో వెంకటేశ్వర్లు పేర్కొన్నారు. సీఎం చంద్రబాబు ప్రాతినిధ్యం వహిస్తున్న కుప్పం నియోజకవర్గ సమగ్ర అభివృద్ధిలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన పిలుపు నిచ్చారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు కళాజాతా ద్వారా ప్రభుత్వ సంక్షేమ పథకాలను సమగ్రంగా తెలుపుతూ అవగాహన కల్పిస్తా మన్నారు. ప్రతి పంచాయతీలోనూ కళాజాతా అవగాహన నిర్వహి స్తామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కార్యదర్శి రమ్యలక్ష్మి, మల్లనూరు పార్టీ అధ్యక్షుడు దామోదర్, సింగిల్ విండో డైరెక్టర్ అన్నా దొరై పాల్గొన్నారు.

## 11 దేవాలయాల పునర్నిర్మాణం
### -రూ.54 కోట్ల మంజూరు
### - టీటీడీ బోర్డు సభ్యుడు శాంతారామ్



**ప్రజాశక్తి-కుప్పం:** కుప్పం నియోజక వర్గంలోని 11 ఆలయాల పునర్నిర్మాణానికి ప్రభుత్వం ఇటీవల 54 కోట్ల రూపాయలు మంజూరు చేసిందని టీటీడీ బోర్డు సభ్యులు శాంతారామ్ పేర్కొన్నారు. శనివారం ఆయన విలేకరులతో మాట్లాడు తూ ఆలయాల పునర్నిర్మాణ పనులు శరవేగంగా సాగు తున్నాయన్నారు. టిటిడి ఆధ్వర్యంలో 142 ఆలయాల అభివృద్ధికి ప్రతిపాదనలు పంపించారని, గ్రామీణ ప్రాంతాల్లో పురాతన ఆలయాల అభివృద్ధికి వచ్చిన ప్రతి ప్రతిపాదనను ఆమోదించి వాటి అభివృద్ధికి అవసరమైన నిధులను ప్రభుత్వం కేటాయిస్తోందన్నారు. టిటిడి ఆధ్వర్యంలో ఒక్కో ఆలయానికి రూ.5 నుండి 25 లక్షల వరకు నిధులు కేటాయిస్తున్నారని పేర్కొన్నారు. దీంతో కుప్పం ప్రాంతంలోని ఆలయాల పునర్నిర్మాణ పనులు జోరుగా సాగుతున్నాయని ఆయన తెలిపారు.

## పీపీఎస్ సేవలు అభినందనీయం: ఎమ్మెల్యే


ఎమ్మెల్యేకు వినతిపత్రమిస్తున్న దృశ్యం

**ప్రజాశక్తి -పలమనేరు:** పలమనేరు పరిరక్షణ సమితి సేవలు అభినందనీయమని స్థానిక ఎమ్మెల్యే అమరనాథ రెడ్డి కొనియాడారు. ఇప్పటిదాకా పలమనేరు పరిరక్షణ సమితి (పి పిఎస్ ) చేపట్టిన సేవలను గుర్తించి ఈ మధ్యకాలంలో స్వచ్ఛాంధ్ర సేవా అవార్డును ప్రభుత్వం అందించింది. దీంతో రాష్ట్రస్థాయిలో స్థానిక మున్సిపల్ కార్యాలయం , ప్రభుత్వం ద్వారా జిల్లా స్థాయిలో ఉత్తమ ఎన్జీఓ గా పలమనేరు పరిరక్షణ సమితిలు అవార్డులను దక్కించుకున్నాయి. దీంతో శనివారం స్థానిక టిడిపి కార్యాలయంలో పలమనేరు పరిరక్షణ సమితి సభ్యులను ఎమ్మెల్యే అభినందించి శుభాకాంక్షలు తెలిపారు. సామాజిక సేవా కార్యక్రమాలలో మరింత ముందుకు వెళ్లాలని వారికి ఆయన సూచించారు. ఈ సందర్భంగా పీపీఎస్ నాయకులు ఎమ్మెల్యేకు ఓ వినతి పత్రం సమర్పించారు. పలమనేరు రెవెన్యూ డివిజన్ ప్రధాన కేంద్రం కావడంతో ఈ ప్రాంతానికి రవాణా సౌకర్యం అత్య వసరం అని, ప్రస్తుతం రైల్వే, హైవే యాక్సెస్ లేక పోవడం వల్ల సాఫ్ట్‌వేర్ ఉద్యో గు లు, రైతులు, విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొం టున్నారని సమితి ప్రతినిధులు తెలిపారు. వేలాది మంది పలమనేరు , పరిసర ప్రాంతాల ప్రజలు ప్రతిరోజు బెంగళూరు, చెన్నైలకు ఉపాధి, విద్య, వ్యాపార అవసరాల కోసం ప్రయాణిస్తున్న నేపథ్యంలో, బుల్లెట్ రైలు, ఎక్స్‌ప్రెస్ హైవే యాక్సెస్ కల్పిస్తే ఈ ప్రాంతం అభివృద్ధి చెందుతుందని వారు వివరించారు. ఈ అంశాన్ని సానుకూలంగా పరిగణించి, ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి అవసరమైన చర్యలు తీసుకుంటానని ఎమ్మెల్యే తెలిపారు. ఈ కార్యక్రమంలో సమితి అధ్యక్షులు టి.ఎల్. నరసింహులు, కార్యదర్శి నారాయణ, కార్యవర్గ సభ్యులు విజయ్‌కుమార్ రెడ్డి, పొన్నుడి, రామచంద్ర, విజయ్‌కుమార్, రెడ్డెప్ప, వెంకట్, మురళి, శ్రీపురం సీతారామయ్య, వీరభద్ర, వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## వాలీబాల్ టోర్నమెంట్ ప్రారంభం


వాలీబాల్ టోర్నమెంటును ప్రారంభిస్తున్న చల్ల రామచంద్రరెడ్డి

**ప్రజాశక్తి - రొంపిచర్ల:** రొంపిచర్ల మండలం బాలుర ఉన్నత పాఠశాలలో రౌనక్, షబ్బీర్, అజామ్ నిర్వహిస్తున్న వాలీబాల్ టోర్నమెంట్‌ను శనివారం పుంగనూరు నియోజకవర్గ టిడిపి ఇన్‌చార్జి చల్ల రామచంద్ర రెడ్డి ప్రారంభించారు. ఈ సందర్భంగా చల్ల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ విద్యార్థులు చదువులతోపాటు క్రీడల్లో కూడా రాణించాలన్నారు. క్రీడలతోనే మానసిక, శారీరక ఉల్లాసం సాధ్యమవుతుందని పేర్కొన్నారు. హోరాహోరీగా సౌత్ జోన్ లెవెల్ వాలీబాల్ టోర్నమెంట్ పోటీలకు విశేష ఆదరణ లభించిందన్నారు. ఈ పోటీలలో చుట్టుపక్కల ప్రాంతాల నుంచి పెద్ద ఎత్తున క్రీడాకారులు పాల్గొన్నారు. నిర్వాహకులు ఈ కార్యక్రమానికి తగిన సౌకర్యాలు భోజన వసతి, విశ్రాంతి తీసుకునేందుకు సదుపాయాన్ని కల్పించారు. ఈ కార్యక్రమంలో రొంపిచర్ల ఎస్ఐ బి సుబ్బా రెడ్డి, కురబ కార్పొరేషన్ డైరెక్టర్ ఉయ్యాల రమణ, రవి నాయుడు, ఇమ్రాన్ ఖాన్, సింగిల్ విండో డైరెక్టర్ శివారెడ్డి, నాగిశెట్టి నాగరాజు, నూకల నాగార్జున్, గూడూరు హరి బాబు, యువ క్రీడాకారులు పాల్గొన్నారు.

# విద్యావ్యవస్థలో మార్పులు అవసరం

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:** విద్యావ్యవస్థలో మార్పులు అవసరమని బిసివై పార్టీ వ్యవస్థపకులు రామచంద్రయాదవ్ అన్నారు. చిత్తూరులోని సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల్లో చోటు చేసుకున్న విద్యార్థుల ఆత్మహత్యల సంఘటనలతో శనివారం సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఇంజినీరింగ్ విద్యార్థులతో మాట్లాడారు. చిన్న, చిన్న విషయాలకు మనస్థాపం చెందకుండా విద్యార్థులు భవిష్యత్‌ను దృష్టిలో ఉంచుకొని ఉన్న స్థానాలకు చేరుకో వాలన్నారు. విద్యా సంస్థలో లోపాలు ఉంటే చర్చల ద్వారా పరిష్కరించుకోవాలని సూచించారు. సీతమ్స్ కళాశాల్లో ఇద్దరు విద్యార్థుల ఆత్మహత్యకు కారణాలను విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. ప్రస్తుతం విద్యార్థులను ఒత్తిడికి గురి చేసే విద్యావ్యవస్థల సమూల మార్పులు అవసరమని, విద్యా విధానం మార్పు కోసం కమిషన్ ఏర్పాటు చేయాలన్నారు. ఇలాంటి సంఘటనలు రాష్ట్ర వ్యాప్తంగా చోటు చేసుకుంటున్నాయని విద్యార్థులు ఒత్తిడికి గురి కాకుండా వ్యక్తత్వ వికాసం, క్రీడలు విద్యా సంస్థలు నిర్వ హిం చాలన్నారు. ఈ కార్యక్రమంలో సీతమ్స్ ఇంజనీరింగ్ కళాశాల కన్వీనర్ బద్రినారాయణ, ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.


మాట్లాడుతున్న బోడే రామచంద్రయాదవ్

## కంటి ఆపరేషన్లకు 21మంది ఎంపిక


**ప్రజాశక్తి-కుప్పం:** కుప్పం లయన్స్ క్లబ్ అధ్వర్యంలో పిఈఎస్ ఆస్పత్రి ఆధ్వర్యంలో శనివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. సుమారు నూట ఇరవై మంది శిబిరానికి హాజరు కాగా వైద్యులు వారికి కంటి పరీక్షలు నిర్వహించి ఉచిత ఆపరేషన్లకు ఇరవై ఒక్క మందిని ఎంపిక చేశారు. లయన్స్ క్లబ్ అడ్వైజర్ మహేష్ మాట్లా డుతూ వృద్ధాప్యం, పౌష్టిక ఆహారలోప, అధిక సమయం మొబైల్ వాడటం వల్ల కంటి చూపు లోపించిన వారికి, డయాబెటిక్‌తో బాధపడుతున్న వారికి వైద్యం చేయించాలని పేర్కొన్నారు. శిబిరానికి హాజరైన వారికి లక్ష్మీనారాయణ హోటల్ వారు భోజన వసతి కల్పించారు. ఈ కార్యక్రమంలో లయన్స్ క్లబ్ సభ్యులు సెల్వం, క్లబ్ అడ్మినిస్ట్రేషన్ చరణ్, డాక్టర్ కృష్ణమూర్తి, పిఇ ఎస్ ఆస్పత్రి వైద్య సిబ్బంది పాల్గొన్నారు.



కంటి వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న డాక్టర్లు

# 'విజయం'లో ఇంటర్ స్కూల్ పోటీ

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:** విజయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ శనివారం జిల్లా అంతటా వివిధ ప్రసిద్ధ పాఠశాలల నుండి విద్యార్థులను ఒకచోట చేర్చి గ్రాండ్ ఇంటర్-స్కూల్ పోటీని నిర్వహించడంతో ఉత్సాహం, ఉత్సాహంతో నిండిపోయింది. ఈ కార్యక్రమం యువ అభ్యాసకులలో సృజనాత్మకత, జట్టుకృషి, ఆరోగ్యకరమైన పోటీని ప్రోత్సహించడం లక్ష్యంగా పెట్టుకుంది. అదే సమయంలో వారి ప్రతిభను మరియు వినూత్న ఆలోచనలను ప్రదర్శించడానికి వారికి ఒక వేదికను కూడా అందించింది. ఉదయం 10గంటలకు ఈ కార్యక్రమం అధికారిక ప్రారంభోత్సవ కార్యక్రమంతో ప్రారంభమైంది. దీనికి విజయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ చైర్మన్ డాక్టర్ ఎం. తేజోమూర్తి, విజయం ఇన్స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ ఎం శైలజ మూర్తి, విజయం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కె. గోపి , ఎస్ఎస్‌కె రాజా ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఆయన మాట్లాడుతూ ఎస్.ఎస్.కె. సమగ్ర విద్యలో పాఠ్యేతర కార్యకలాపాల ప్రాముఖ్యతను రాజా నొక్కిచెప్పారు. విద్యార్థులు క్రీడా స్ఫూర్తితో అన్ని కార్యక్రమాల్లో చురుకుగా పాల్గొనాలని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో అనేక మంది ప్రముఖులు, అధ్యాపక సభ్యులు , తల్లిదండ్రులు పాల్గొన్నారు, వారు యువకులకు మద్దతు, ప్రశంసలను అందించారు.క్విజ్, ఎలోక్యూషన్, వ్యాస రచన, పెయింటింగ్, పోస్టర్ ప్రెజెంటేషన్ వంటి వివిధ విభాగాలలో పోటీలు నిర్వమించారు. ప్రతి కార్యక్రమంలో చిత్తూరు చుట్టుపక్కల ఉన్న 30కి పైగా పాఠశాలలకు ప్రాతినిధ్యం వహిస్తున్న విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొన్నారు. పాల్గొన్నవారు రోజంతా అద్భుతమైన ప్రతిభ, సృజనాత్మకత, విశ్వాసాన్ని ప్రదర్శించారు. సాయంత్రం ముగింపు కార్యక్రమం నిర్వహించారు. ఇక్కడ విజేతలకు నగదు బహుమతులు, అత్యుత్తమ సర్టిఫికెట్లు ప్రదానం చేశారు. బహుళ విభాగాలలో అత్యుత్తమ ప్రదర్శన ఇచ్చినందుకు చిత్తూరులోని బివి రెడ్డి సిబిఎస్ఇ స్కూల్ రోలింగ్ ట్రోఫీని, విజయం సిబిఎస్ఇ స్కూల్ రోలింగ్ షీల్డ్‌ను గెలుచుకుంది. తన ముగింపు వ్యాఖ్యలలో, ఈవెంట్ కోఆర్డినేటర్, ఈవెంట్‌ను గొప్పగా విజయవంతం చేసినందుకు పాల్గొన్న అన్ని పాఠశాలలు, న్యాయనిర్ణేతలు, వాలంటీర్లకు కృతజ్ఞతలు తెలిపారు.



బహుమతులు అందుకున్న విద్యార్థులతో స్కూలు యాజమాన్యం

# క్రైం న్యూస్

## రైలు కిందపడి యువకుడు మృతి

**ప్రజాశక్తి-గుడిపల్లి:** రైలుకింద పడి యువకుడు మృతి చెందిన సంఘటన మండలంలో శనివారం చోటుచేసుకుంది. గుడిపల్లి మండలం సిరిగిరి పల్లి గ్రామానికి చెందిన రాధాకృష్ణ కుమారుడు రాకేష్ (27) శనివారం ఉదయం చెన్నై నుండి బెంగళూరు వెళ్ళు కన్యాకుమారి ఎక్స్‌ప్రెస్ రైలు కిందపడి మృతి చెందినట్లు స్థానికులు గుర్తించారు. ఈ విషయం తెలుసుకున్న రైల్వే పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలు తెలియాల్సి వుంది.



మొదటి బహుమతి సాధించిన పీఈఎస్ పబ్లిక్ స్కూలు విద్యార్థులు

## టెర్మ్ స్టార్మ్ పోటీలో పిఈఎస్ విద్యార్థులు

**ప్రజాశక్తి -చిత్తూరు అర్బన్:** పీఈఎస్ పబ్లిక్ పాఠశాల కామర్స్ విభాగానికి చెందిన 11 , 12వ తరగతి విద్యార్థులు 2025- నవంబర్ 8వ తేదీ వేలూరులోని విఐటి విశ్వవిద్యాలయం నిర్వహించిన కంఫెస్ట్ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో మొత్తం 41 పాఠశాలకు చెందిన దాదాపు వెయ్యి మందికి పైగా విద్యార్థులు పాలొన్నారు. అందులో పీఈఎస్ పబ్లిక్ పాఠశాలకు చెందిన జి భవిష, జి అక్షయ చంద్ర టెర్మ్ స్టార్మ్ పోటీలో మొదటి బహుమతిని కైవసం చేసుకున్నారు. డి నక్షత్ర, ఎన్ రోహిణి, ఎం తనూజ ఎకో సమ్మిట్ పోటీలో మూడో బహుమతిని సొంతం చేసుకున్నారు. ఈ సందర్భంగా పీఈఎస్ పబ్లిక్ పాఠశాల ప్రిన్సిపాల్ వైవి కృష్ణ బాబు కామర్స్ విభాగాధిపతులైన రజనీకాంత్‌కు, జ్యోత్స్నకు గెలుపొందిన విద్యార్థులకు అభినందనలు తెలిపారు.



## విద్యార్థినులకు కరాటే శిక్షణ

**ప్రజాశక్తి -యాదమరి:** మండలంలోని కె.గొల్లపల్లె హైస్కూల్ ప్లస్‌లో బాలిక విద్యార్థులకు సర్వశిక్ష అభియాన్(ఎస్.ఎస్.ఎ)ద్వారా 6నుంచి 9తరగతుల విద్యార్థినులకు కరాటే తరగతును మొదలైనట్లు ఇన్‌చార్జి హెచ్‌యం జెభాస్కర్ రెడ్డి తెలిపారు. గ్రామ ప్రాంత బాలికలకు ఆత్మరక్షణ కోసం ఈ తరగతులు ఎంతో ఉపయోగ కరంగా ఉంటాయని, బాలికల్లో ఆత్మవిశ్వాసం, సాహసం, ధైర్యం ఏర్పడుతుందని సీనియర్ గణితోపాధ్యాయుడు కె కనకాచారి పేర్కొన్నారు. ఈ శిక్షణ సుమారు 120 మంది విద్యార్థులకు రెండు నెలలు పాటు, సాయంత్రం ఓ గంట నేర్పుతారన్నారు. కరాటే మాస్టర్స్ ఎ.దివ్య,ఎస్.సింధు వ్యవహిస్తున్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు భాస్కర్ రెడ్డి, కనకాచారి, మదన్ మోహన్, దామోదర్ రెడ్డి, ఆష, కె భారతి, రమాదేవి, మంజుల, కె అరుణభారతి, రాజేశ్వరి, హిమబిందు, సుల్తాన్ , షణ్మగం పాల్గొన్నారు.

## ప్రతి పోటీలోనూ పాల్గొనాలి
### ప్రిన్సిపాల్ డాక్టర్ వందన త్రిపాటి



**ప్రజాశక్తి -బంగారుపాలెం:** ప్రతి పోటీలోనూ విద్యార్థిని విద్యార్థులు పాల్గొనాలని పివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ వందన త్రిపాఠి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని పివిఆర్ ప్రభుత్వ జూనియర్ కళాశాలలో విద్యార్థి వరుణ్ అభినందించారు .ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ నెల 5వ తేదీ చిత్తూరు పి సి ఆర్ లో భారత రాజ్యాంగ దినోత్సవం పురస్కరించుకొని పౌర హక్కులు విధులు అంశంపై వ్యాసరచన పోటీలు నిర్వహించగా కళాశాలకు చెందిన విద్యార్థి వరుణ్ పాల్గొని ఉత్తమ ప్రతిభ కనబరిచి జిల్లా మొదటి స్థానం సాధించారన్నారు. ప్రతి ఒక్కరి పోటీ తత్వంతో విద్య అభ్యసించి ఉన్నత శిఖరాలకు ఎదగాలన్నారు. అనంతరం విద్యార్థిని అభినందించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు మురళీకృష్ణ ,హసీనా, చంద్రమోహన్ రెడ్డి, శ్రీనివాసులు పలువురు అధ్యాపకులు పాల్గొన్నారు.